

చట్టాలు కఠినంగా ఉండాలి

వైద్యులపై దాడులు చేస్తే కఠిన చర్యలు అమలు చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలి. నాడి పట్టే డాక్టర్ భయంతో వైద్యం చేయలేడు. ఇటీవల కాలంలో డాక్టర్లపై దాడులు చేయడం ఆందోళన కలిగించే విషయం. ప్రతి వైద్యశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయి భద్రత కల్పించాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని వదిలిపెడితే సమాజానికి చేటు. అలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూడాలి.

– డాక్టర్ కె.వంశీకృష్ణ, ఈఎన్‌టీ స్పెషలిస్టు, మార్కాపురం జీజీహెచ్





ఆరోగ్య కేంద్రంలో భద్రత పెంచాలి:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు భద్రత పెంచాలి. కోల్‌కత్తా సంఘటనతో దేశంలో మహిళలకు రక్షణ కరువైందని అర్థమైంది. జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి రోజులు గడుస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దోషులను కఠినంగా శిక్షించాలి. వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి.

ఎం.సునీత, వైద్యాధికారి, దొనకొండ

సిబ్బంది ఇలా.. వైద్య సేవలు ఎలా?

- మూతపడిన దరిమడుగు ఆరోగ్య ఉపకేంద్రం
- ఉద్యోగులు ఇష్టారీతిగా వ్యవహరించడంపై గ్రామస్తుల ఆగ్రహం



మూతపడిన దరిమడుగు ఆరోగ్య ఉప కేంద్రం

మార్కాపురం రూరల్: మండలంలోని దరిమడుగు గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం బుధవారం మధ్యాహ్నం 12 గంటలకే మూతపడటంతో రోగులు వెనుదిరిగి వెళ్లారు. రోగులు తమ ఆరోగ్య సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక గంటలకొద్దీ వైద్యశాల వద్ద వేచి ఉండి నిరాశగా వెనుదిరిగారు. చేసేదేమీ లేక మార్కాపురం పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నారు. కొందరు వైద్యసిబ్బంది ఉదయం వచ్చి రిజిస్టర్లలో సంతకాలు చేసి వారి సొంత పనులపై వెళ్తుండటంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోగులకు అందుబాటులో ఉండాల్సిన సిబ్బంది విధులకు డుమ్మా కొట్టడం చర్చనీయాంశంగా మారింది. సీజనల్ వ్యాధులతో బాధపడుతూ, దూరప్రాంతాలకు వెళ్లలేక స్థానిక వైద్యశాలలోనే చూపించుకుందామనుకున్న వారు ఇక్కడి సిబ్బంది తీరుతో విసిగిపోతున్నారు. వైద్యశాల మూసివేయడంతో కొందరు ఆకతాయిలు వైద్యశాల పరిసరాల్లో మద్యం సేవించి గాజుసీసాలు పగలగొట్టారు. ఉన్నతాధికారులు స్పందించి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉండేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థిని లక్ష్మి మృతిని రాజకీయం చేయవద్దు

- సోషల్ మీడియాలో వచ్చిన కథనం అవాస్తవం

రాచర్ల: రాచర్ల మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థిని ఎం.లక్ష్మి మృతిని రాజకీయం చేయవద్దని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. అర్థవీడు మండలం రంగాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని లక్ష్మి రెండో సంవత్సరం ఇంటర్ చదువుతుంది. ఈ నెల 19వ తేదీన తల్లిదండ్రులు కస్తూరిబా బాలికల పాఠశాలకు వచ్చి గృహ ప్రవేశం ఉందని ప్రిన్సిపాల్ మాలకొండమ్మ అనుమతితో తమ కూతురిని తీసుకెళ్లారు. 25వ తేదీ ఆదివారం ఉదయం నాలుగు గంటలకు తమ కుమార్తె గుండెపోటు రావడంతో మృతి చెందిన విషయాన్ని వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్‌కు తెలియజేశామన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు తమ గ్రామానికి వచ్చి కుమార్తె మృతదేహాన్ని చూసి మృతికి కారణాలు అడిగి తెసుకున్నారని చెప్పారు. తమ కుమార్తె గుండెపోటుతో మరణించింది తప్ప మరో కారణం లేదన్నారు. 27వ తేదీ అర్థవీడు మండలం, రంగాపురం గ్రామానికి జిల్లా డీసీడీవో ప్రమోదతో పాటు రాచర్ల మండల ఎంఈవోలు వారణాపి గిరిధర్‌శర్మ, శివకోటేశ్వరరావులు తమను విచారించారని చెప్పారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ మాలకొండమ్మను వివరణ కోరగా లక్ష్మి గుండెపోటుతో చనిపోయిందని తల్లిదండ్రులు చెప్పారు. పాఠశాలలో ఎటువంటి సంఘటనలు జరగలేదని చెప్పారు. పాఠశాలలో పనిచేసే కొందరు కేవలం అలజడి సృష్టించాలని ఏమీ లేకున్నా ఉన్నట్లుగా చిత్రీకరించి బయటి వ్యక్తులకు లోపలి విషయాలను చేరవేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు.

తహసీల్దార్ భాగ్యలక్ష్మి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన భాగ్యలక్ష్మి

కొమరోలు: తహసీల్దార్‌గా డి.భాగ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు నిర్వహిస్తున్న మల్లికార్జుననాయుడు ఆమెకు బాధ్యతలు అప్పగించారు. భాగ్యలక్ష్మి మార్కాపురం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కొమరోలు వచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

135 మందికి ఉద్యోగాలు



ఇంటర్వ్యూలు చేస్తున్న కంపెనీ హెచ్ఆర్‌లు

బేస్తవారిపేట: స్థానిక కందుల ఓబులరెడ్డి డిగ్రీ కళాశాలలో బుధవారం పలు కంపెనీలు నిర్వహించిన మెగాజాబ్ మేళ కార్యక్రమంలో 135 మందికి ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కంపెనీ హెచ్ఆర్‌లు తెలిపారు. టెక్ మహీంద్ర, షాడో ఫ్యాక్స్, అమెజాన్, ఫ్లిప్ కార్ట్, బ్లూస్టార్, ఎయిర్‌టెల్ పేమెంట్స్, డీమార్ట్, ఈకార్ట్ కంపెనీల హెచ్ఆర్‌లు షేక్ బాషా, జి.ఇంద్రసేనారెడ్డి, అనంత్, రమణ, వెంకటేష్, శేఖర్, జాయ్, రాంబాబులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కందుల ఓబులరెడ్డి డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న, ఫైనలియర్, అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు 27 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఓబులరెడ్డి తెలిపారు.

రైతులు సబ్సిడీ పథకాలు వినియోగించుకోవాలి



రైతుకు సలహాలు ఇస్తున్న హెచ్‌ఓ శ్వేత

బేస్తవారిపేట: ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో అందించే సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత అన్నారు. బుధవారం మండలంలోని ఒందుట్లలో బత్తాయి, మామిడి, టమోట పంటలను ఆమె పరిశీలించారు. కూరగాయాలు, పండ్ల తోటల్లో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు హెక్టార్ మల్చింగ్‌కు రూ.16 వేలు, రెండు హెక్టార్లకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత నీటి కుంటలకు 50 శాతం రాయితీ రూ.75 వేలు, కమ్యూనిటీ నీటి కుంటలకు 100 శాతం రాయితీ రూ.20 లక్షలు మించకుండ ఇస్తున్నట్లు వివరించారు. పండ్ల తోటల వద్ద పంట సేకరణ, నిల్వకు, ప్యాకింగ్ చేసుకునేందుకు 50 శాతం సబ్సిడీపై ప్యాక్ హౌస్ యూనిట్‌కు రూ.2 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పండ్ల తోటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ–క్రాఫ్ బుకింగ్ చేయించుకోవాలని కోరారు.

కాణిపాకంలో మాజీ ఎమ్మెల్యే అన్నా పూజలు



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: చిత్తూరు జిల్లా కాణిపాకం పుణ్యక్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వినాయకస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం అఖిల భారత ఆర్యవైశ్య నిత్య అన్నపూర్ణ సత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో మాజీ ఎంపీ టీజీ వెంకటేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఆర్యవైశ్య సత్రాల నిర్వాహకులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా ఉంటున్నాయని అన్నా అభినందించారు.

ఘనంగా కృష్ణాష్టమి సంబరాలు



ఉభయదేవేరులతో చెన్నకేశవస్వామి



ఉట్టి కొడుతున్న యువకులు

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామివారి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చెన్నకేశవస్వామివారిని ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయం ముందు భాగంలో ఉట్టి మండపంలో స్వామివారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉట్టి కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది కోటిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

తేడాలుంటే సీజ్ చేస్తాం

తాళ్లూరు (దర్శి): మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులను నిరంతరం తనిఖీ చేస్తామని, వాటిల్లో తేడాలుంటే సీజ్ చేస్తామని మండల వ్యవసాయాధికారి బి. ప్రసాదరావు హెచ్చరించారు. తూర్పుగంగవరంలోని శ్రీ శ్రీనివాస ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపును ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సరుకు నిల్వలు సమంగా ఉన్నాయా? లేదా అని సరిచూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం తనిఖీలు నిర్వహించి నాణ్యత లోపం ఉంటే వాటిని రీ ఎనాలిసిస్‌కు పంపిస్తామని, వాటిలో కూడా ఫెయిల్ అయితే యాక్టు ప్రకారం సరుకును, సంబంధిత రికార్డులను సీజ్ చేసి కోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. నిరంతరం తనిఖీలతో నాసిరకం సరుకు, అనుమతులు లేని ప్రొడక్ట్స్ తెచ్చి అమ్మేందుకు అవకాశం ఉండదన్నారు. తద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుతాయని తెలిపారు.

మార్కాపురంలో మోస్తరు వర్షం



వర్షంతో నిర్మానుష్యంగా మారిన మెయిన్ బజారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో బుధవారం రాత్రి 7.30 నుంచి 8 గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు వీధులు జలమయమయ్యాయి. ఆకస్మికంగా కురిసిన వర్షంతో ప్రజలు కాస్త సేద తీరారు. కంది, పత్తి, పొగాకు పంటలకు ఈ వర్షం కొంత మేలు చేస్తుందని రైతులు భావిస్తున్నారు.

పీఎం జన్‌మన్‌పై అవగాహన ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ

గిద్దలూరు రూరల్: గిరిజనులు పీఎం జన్‌మన్ కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ కె.హేమలత అన్నారు. ఆదివాసి చెంచు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి సమగ్ర అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిగువమెట్ట చెంచుకాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా చెంచులకు పక్కా గృహాలు, ప్రతి ఇంటికి విద్యుత్, మంచినీటి కుళాయి, రహదారులు, నాణ్యమైన విద్య అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈఓఆర్డీ చెన్నారావు, కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వండి

- వాణిజ్య పన్నుల శాఖ సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగులు

మార్కాపురం: ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులను మినహాయించాలని బుధవారం పట్టణంలోని కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అసోషియేషన్ పిలుపు మేరకు నిరసనలో పాల్గొన్నట్లు తెలిపారు. వాణిజ్య పన్నులశాఖ ఉన్నతాధికారుల అవినీతిపై ఏసీబీ దర్యాప్తు చేయాలని, ప్రాంతీయ కార్యాలయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీఎస్‌టీఓలకు సరైన వర్క్ ఫంక్షన్ ఏర్పాటు చేయాలని, స్వప్రయోజనాల కోసం ఆర్డర్ టు సర్వ్ పేరుతో వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగులను బలి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు ఉన్నతాధికారులు పన్ను ఎగవేతదారులకు సహకరించినందున ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం జరిగిందన్నారు.

'మా భూమిని మాకు అప్పగించండి'

- రెవెన్యూ కార్యాలయం ఎదుట రైతు ధర్నా



ధర్నా చేస్తున్న గాలెమ్మ కుటుంబ సభ్యులు

తర్లుపాడు: తమ భూమిని తమకు అప్పగించాలంటూ తర్లుపాడుకు చెందిన గోగు గాలెమ్మ, కుటుంబ సభ్యులు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బాధితుల కథనం మేరకు.. గ్రామ సర్వే నంబర్ 388/3లో 3.94 ఎకరాల భూమి గాలెమ్మ కుటుంబానికి పూర్వీకుల ద్వారా సంక్రమించింది. 1984లో ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించేందుకుగాను ల్యాండ్ అక్విజేషన్ ద్వారా అందులో మూడున్నర ఎకరాలు తీసుకుంది. మిగిలిన భూమిని తమకు అప్పజెప్పాలని 10 సంవత్సరాలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కందుకూరు ఆర్డీఓ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా రెండు మూడు రోజుల్లో భూమి అప్పగిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని గాలెమ్మ కోరారు.

పెన్షన్లు ఇంటి వద్దే పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటదాస్

గిద్దలూరు రూరల్: పెన్షన్లు ఇంటి వద్దే పంపిణీ చేయాలని కమిషనర్ వెంకటదాస్ అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయం ఉద్యోగులకు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్‌దారుల ఇంటి వద్దే 1వ తేదీ 11 గంటల మధ్యలో పెన్షన్ నగదు పంపిణీ చేయాలన్నారు. సచివాలయం ఉద్యోగులు అశ్రద్ధగా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. ఈ రెండు రోజుల పాటు ప్రతి ఉద్యోగి పెన్షన్‌దారుల ఇంటిని గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 31వ తేదీన కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నామని, అందులో ప్రతి కౌన్సిలరు హాజరు కావాల్సిందిగా కోరారు. రోడ్లపై సంచరించే గోవుల యజమానులను గుర్తించి వాటిని రోడ్ల మీదకు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలా కాని పక్షంలో గోవుల యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని గోశాలకు తరలిస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందికరంగా కొందరు పశుపోషకులు రోడ్లపై అడ్డంగా కట్టేసే పశువులను వెంటనే అక్కడ నుంచి తొలగించాలన్నారు. ఆ దిశగా యజమానులకు అవగాహన కల్పించి పశువులను తరలించే చర్యలు చేపడతామన్నారు. ఏఈ శంకర్‌నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వలి, ఆర్‌ఐ ఆషీస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సై నరసింహారావు

కంభం: మొబైల్ ఫోన్‌లో అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలకు ఎవరూ స్పందించవద్దని ఎస్సై బి.నరసింహారావు సూచించారు. మండలంలోని లింగాపురం, యర్రబాలెం గ్రామాల్లో బుధవారం ఎస్సై సిబ్బందితో కలిసి పర్యటించారు. ఇటీవల కాలంలో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా బ్యాంకుల నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఓటీపీలు అడిగితే చెప్పకూడదన్నారు. అనుమానాస్పదం అనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

క్లుప్తంగా

తెలుగుభాషా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

గిద్దలూరు రూరల్: తెలుగుభాషా దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, సంఘ సేవకుడు బీఎస్ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం సమీపంలోని సాయిబాబా ఆలయం ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించబోయే తెలుగుభాషా దినోత్సవం, గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా ప్రతిష్ఠించిన పోలేరమ్మ విగ్రహం

కొనకనమిట్ల: మండలంలోని సిద్ధవరం గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ ఆగమ పండితుడు పోతులూరి శివరామాచార్యస్వామి శిష్య బృందం విగ్రహమూర్తులను ప్రతిష్ఠించింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.



పోతురాజుస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి



మునగపాడులో రైతులకు సలహాలిస్తున్న ఏడీఏ శైలజ

కొనకనమిట్ల: రైతులు ఆధునిక పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఎ.శైలజ, దర్శి ఏడీఏ బాలాజీనాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మునగపాడు, పెదారికట్ల రైతు సేవా కేంద్రాల్లో ×ఆత్మ× ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. పంటల సాగులో మెళకువలు పాటించి, అధిక దిగుబడి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌తో రైతులకు మేలు



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ, తహశీల్దార్

మార్కాపురం రూరల్: రైతులు సాగు చేసిన పంటల వివరాలు ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏడీఏ బాలాజీ నాయక్, మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి సూచించారు. మండలంలోని కోలభీమునిపాడు, కొత్తపల్లి, బిరుదులనరవ, రామచంద్రాపురం గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. రైతులకు పంటల సంరక్షణపై ఏడీఏ సలహాలు, సూచనలు ఇచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామంలో ఎల్‌పీ నంబర్ల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, రైతు సేవా సిబ్బంది సంధ్య, ఖైరూన్, శివశంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. కొమరోలు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ లైన్‌లో కొత్త లైన్‌ను వేస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. చింతలపల్లె ఫీడర్ పరిధిలోని హనుమంతరాయునిపల్లె, కొత్తపల్లె, మలికేపల్లె, ఓబులాపురం, కూరాకువానిపల్లె, వర్ధనపల్లె, చింతలపల్లె గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.